

అర్జీదారులతో మాట్లాడుతున్న భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

ములుగు, భూపాలపల్లి కలెక్టర్లు ఇలా త్రిపాఠి, భవేశ్ మిశ్రా

ములుగు రూరల్/భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 29 : ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం పనికిరాదని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ములుగు, భూపాలపల్లి కలెక్టర్లు ఇలా త్రిపాఠి, భవేశ్ మిశ్రా అధికారులకు సూచించారు. సోమవారం ఆయా కలెక్టరేట్లలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ములుగు జిల్లాలో రెవెన్యూకు సంబంధించి 20, ఇతర శాఖలవి 8, భూపాలపల్లిలో భూ సమస్యలు, పెన్షన్లు తదితర సమస్యలపై 18 అర్జీలు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఒకవేళ అర్జీని తిరస్కరిస్తే వివరాలను సంబంధిత వ్యక్తికి తెలపాలని కలెక్టర్లు సూచించారు. కార్యక్రమంలో ములుగు అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్‌వో అప్పయ్య, సివిల్ సప్లై డీఎం రాంపతి, ఎస్పీ కార్పొరేషన్ డీఈ తుల రవి, ఏడీవో విజయచందర్, డీడబ్ల్యూవో స్వర్ణలతాలెనినా, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, డీఈవో పాణిని, డీసీవో సర్దార్‌సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొప్పుల ఈశ్వర్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

మహదేవపూర్, ఏప్రిల్ 29 : బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్‌రావు కోరారు. సోమవారం మండలంలోని కుదురుపల్లి, ఎడపల్లి గ్రామాల్లో కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వస్తేనే కాంగ్రెసోళ్లకు పథకాలు గుర్తుకువస్తాయని, ఆ తర్వాత వాటిని అమలు చేయక మోసం చేస్తారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమైపోతామన్నారు. అభివృద్ధి చేసే బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించి కారు గుర్తుకు ఓటెయ్యాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మహదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, సీనియర్ నాయకులు పెండ్యాల మనోహర్, అన్కారీ ప్రకాశ్, తడకల రమేశ్, మండల యూత్ అధ్యక్షుడు ఎండీ అలీంఖాన్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో బీఆర్ఎస్ సమావేశాలు

ములుగురూరల్, ఏప్రిల్ 29 : ములుగు మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలు నిర్వహించనున్నట్లు మండల కోఆర్డినేటర్ పాలెపు శ్రీనివాస్ తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు ఆదేశాల మేరకు సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఎంపీటీసీ క్లస్టర్ల పరిధిలో నిర్వహించినట్లు చెప్పారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవీ సుధీర్‌యాదవ్, జడ్పీటీసీ సకినాల భవాని, మండల కమిటీ సభ్యులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారని తెలిపారు. నేడు ఉదయం 6గంటలకు జంగాలపల్లి, ఇంచర్ల, 7గంటలకు సర్వాపురం, కొత్తూరు, 8 గంటలకు కాసిందేవిపేట, దేవగిరిపట్నం, 9గంటలకు పత్తిపల్లి, జగ్గన్నపేట, 10 నుంచి 11 గంటల వరకు ములుగు, బండారుపల్లి, ములుగు టౌన్, జీవంతరావుపల్లి, మధ్యాహ్నం రెండు గంటలకు అబ్బాపురం, జాకారం, 3గంటలకు భూపాల్‌నగర్ (పందికుంట), రామచంద్రాపురం, సాయంత్రం 4గంటలకు కొండిశలకుంట, 5గంటలకు మల్లంపల్లి, మహ్మద్‌గౌస్‌పల్లి ఎంపీటీసీ పరిధిలో సమావేశాలుంటాయన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, గ్రామ కమిటీ అధ్యక్ష,కార్యకర్తలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

ములుగురూరల్, ఏప్రిల్ 29 : నేటి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఓటరు అవగాహన సదస్సు కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నేడు జిల్లా పరిషత్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉద్యోగులు, యువత, యువజన సంఘాలు, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర ఆసక్తిగల దాతలు ఉదయం 9గంటలకు పాల్గొనాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, SWAPANASREE YELLENKI, R/o. H.No. 3-339, Main Road, Parkal, Warangal, Hanumakonda, 506164, T.S., Changed My Name as YERRA SWAPNA SRI.
NTW-00

CHANGE OF NAME
★I, ADAPA ROJA R/O H.NO. 22-8-52, DOCTORS COLONY 2, DESHAIPET, WARANGAL, TS. Changed My Name As GATLA MANASA W/o. GATLA RAVINDER.
NT-327809

WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840

జాబ్ గ్యారంటీ
★మన జిల్లాలోని నూతనంగా ప్రారంభించిన ప్రముఖ కంపనీలలో జాబ్ చేయుటకు హెల్పర్స్, సూపర్ వైజర్స్, కంప్యూటర్ ఆపరేటర్లు, టీం లీడర్స్ కావలెను. జీతం: 15,000/- to 21,000/- రూం+భోజనం కలదు. సెల్: 8121287441.
NTW-00

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

మత్తు పదార్థాలపై ఎక్సైజ్ నజర్

- పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖ సమన్వయంతో చెక్‌పోస్టుల ఏర్పాటు
- పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి
- గుడుంబా నియంత్రణకు రెండు ప్రత్యేక నిఘా బృందాలు
- ఇప్పటికే 209 కేసులు నమోదు
- ములుగు జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ములుగు, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా జిల్లా ఎక్సైజ్ శాఖ పకడ్బందీ చర్యలు చేపడుతున్నది. అక్రమ మద్యం, మత్తు పదార్థాల సరఫరాపై నిఘా ముమ్మరం చేసింది. సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ నుంచి సుంకం చెల్లించని మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు జిల్లాకు తీసుకురాకుండా నిరోధించేందుకు పోలీస్, రెవెన్యూ, ఫారెస్టు శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఇందులో భాగంగా ఏటూరునాగారం మండలంతో పాటు ములుగు మండలం మల్లంపల్లి గ్రామం వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. అక్రమంగా మద్యం తరలించే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. పక్క జిల్లాల నుంచి గంజాయి, మద్యం దిగుమతి కాకుండా జిల్లాలో ఏడు మొబైల్ చెక్ పాయింట్‌లను ఏర్పాటు చేశారు. అనధికార మద్యం, కల్తీ కల్లు అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపడుతున్నారు.

ముమ్మర తనిఖీలు, దాడులు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఎక్సైజ్ శాఖ అధికారులు ముమ్మర తనిఖీలు, దాడులు చేస్తున్నారు. ఈ నెల 24 వరకు 209 కేసులను నమోదు చేసి 124 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి 2,055 లీటర్ల గుడుంబా, 237 లీటర్ల మద్యం, 277 లీటర్ల బీర్లను సీజ్ చేసి 19 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు 82,975 లీటర్ల బెల్లం, చక్కెర పానకాన్ని ధ్వంసం చేశారు. రానున్న రోజుల్లో సారాయి తయారీ కేంద్రాలపై దాడులు చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.

వాజేడు మండలంలోని ఛత్తీస్‌గఢ్-తెలంగాణ బార్డర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ములుగు ఎక్సైజ్ స్టేషన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. అక్రమ మద్యం, గంజాయి, గుడుంబా తరలే క్రమంలో ప్రజలు నేరుగా సమాచారం అందించేందుకు 18004252523 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

నిరంతరం దాడులు కొనసాగుతూనే ఉంటాయి..

- శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల సమన్వయంతో నిరంతరం దాడులు కొనసాగుతూనే ఉంటాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో రూ.1,04,12,102 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నాం. అధికారులు, సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎక్సైజ్ శాఖ చర్యలు చేపడుతుంది.

మోదీని గద్దె దించాలి

■ భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద నరేంద్ర మోదీని గద్దె దించి భారత రాజ్యాంగాన్ని కాపాడాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన పదేళ్లలో మోదీ ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొస్తే దాన్ని వ్యతిరేకిస్తూ 400 రోజులు రైతులు ధర్నాలు చేసినా పట్టించుకోలేదని, దీంతో 760 మంది అన్నదాతలు చనిపోయారన్నారు. జీఎస్టీ పేరుతో పేదల కడుపులు కొడుతున్నారన్నారు. రాముడి పేరుతో రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. దేశంలో కులాలు, మతాల పేరుతో బీజేపీ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నదని మండిపడ్డారు. సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, వామపక్షాల నాయకులు వెలిశెట్టి రాజయ్య, ఆకుదారి రమేశ్,మేకల మహేందర్ , ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్, శేఖర్, శ్రీధర్, లక్ష్మక్క, రాజిని, గోవర్దన్, కొసరి రమేశ్, నరేష్, మహేశ్వరి పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు సత్యనారాయణరావు, ప్రకాశ్‌రెడ్డి

నేడు రేగొండలో సీఎం సభ

రేగొండ, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు రేగొండ మండలకేంద్రంలో నిర్వహించే బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. దీంతో సోమవారం ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. వారి వెంట నాయినేని సంపత్‌రావు, విజ్జిన్‌రావు, కిష్టయ్య, ఉమేశ్‌గౌడ్, సంతోష్, పున్నం రవి, పట్టెం శంకర్, మేకల భిక్షపతి తదితరులున్నారు.

ధరణిలో పేరు తొలగించాలని వినతి

ములుగురూరల్, ఏప్రిల్ 29 : ములుగు మండలం పత్తిపల్లి గ్రామ రెవెన్యూ శివారు సర్వే నంబర్‌లోని 104/ఏలో ఉన్న 4.13 ఎకరాల భూమిని గతంలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇచ్చిందని, ఈ భూమి గ్రామానికి చెందిన హట్కర్ సూర్యకిరణ్ పేరుపై ధరణిలో వస్తున్నందున పేరును తొలగించాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు ఏఐటీయూసీ నాయకుడు రవీందర్, సీపీఐ నాయకుడు అమ్జద్‌పాషాతో కలిసి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1980-81లో 2 గుంటల చొప్పున 51 మందికి అప్పటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం 20 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించినట్లు చెప్పారు. ఈ భూమి సూర్యకిరణ్ పేరుతో ఉండడంతో రైతుబంధు సైతం పొందుతున్నాడన్నారు. కలెక్టర్ స్పందించి అతని పేరుతో ఉన్న భూమిని రికార్డుల్లో నుంచి తొలగించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో భూక్యా పరమ్‌సింగ్, వెంకటస్వామి, సాంబయ్య, నటరాజు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వెంకటాపూర్, ఏప్రిల్ 29 : మండలంలోని జవహర్‌నగర్ గ్రామ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై చల్లా రాజు కథనం ప్రకారం.. మంగపేట మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన తండ అనిల్ (40) ఈ నెల 23న ములుగు ప్రభుత్వ దవాఖానలో అనారోగ్యంతో చేరాడు. 24న వైద్యశాల నుంచి బయటకు వెళ్లి జవహర్‌నగర్ ప్రాంతంలో మృతి చెందాడు. అనిల్ తాగుడుగు బానిసై మతిస్థిమితం తప్పి బాగాలేక జవహర్‌నగర్ ప్రాంతానికి చేరుకొని మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు ఎస్సై చెప్పారు.

చెక్కును అందజేస్తున్న ములుగు ఎస్పీ శబరీశ్

భద్రత చెక్కు పంపిణీ

ములుగు, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో అటాచ్మెంట్‌పై హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కే దేవయ్య గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, దేవయ్య భార్య శారద, కుమారుడికి ఎస్పీ శబరీశ్ సోమవారం భద్రత చెక్కును తన కార్యాలయంలో అందజేశారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని వారికి ఎస్పీ భరోసా కల్పించారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

■ కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

మహదేవపూర్ (కాటారం), ఏప్రిల్ 29 : వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం కాటారం మండలంలోని నస్తూర్‌పల్లిలో పోలీసు, విద్యుత్, అటవీ శాఖ అధికారులతో కలిసి వన్యప్రాణుల సంరక్షణ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వన్యప్రాణులను వేటాడొద్దని సూచించారు. ఉచ్చులు, తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్, అటవీ, పోలీసు అధికారులు సమన్వయంతో వన్యప్రాణుల మాంసాన్ని విక్రయించే మాఫియాను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహదేవపూర్ ఎఫ్ఆర్‌వో కమల, డీఆర్‌వో ఎం రాజేశ్వర్, ఎస్సై అభినవ్, ఎఫ్ఎస్‌వోలు మమత, మగ్గాల్, బీట్ అధికారులు మోనా, రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా, మహదేవపూర్ మండలం పెద్దంపేటలో ఎస్సై చక్రపాణి ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. వేటగాళ్లపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలీసులు చంద్రమోహన్, కిషన్, జీపీ కార్యదర్శి సృజన్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడవిలో చెలరేగిన మంటలు

దగ్ధమవుతున్న వృక్ష సంపద

మహదేవపూర్, ఏప్రిల్ 29 : మండల కేంద్రంలోని బృహత్పల్లె ప్రకృతి వనం సమీపంలోని అటవీ క్షేత్రంలో సోమవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగి విలువైన మొక్కలు, చెట్లు ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఇదిలా ఉంటే ఇటీవల సూరారం, కుదురుపల్లి, నస్తూర్‌పల్లి గ్రామాల శివారులోని అటవీ క్షేత్రాల్లో మంటలు చెలరేగి విలువైన వృక్ష సంపద కాలిబూడిదైన విషయం తెలిసిందే. అటవీ శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ మంటలు చెలరేగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

సరుకులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ములుగురూరల్, ఏప్రిల్ 29 : మండలంలోని కొత్తూరులో ఇటీవల ప్రమాదవశాత్తు రెండు ఇండ్లు కొల్పోయిన బాధితులను సోమవారం ఎంపీపీ గండ్రకోట శ్రీదేవీ సుధీర్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. రెండు కుటుంబాలకు 50కేజీల చొప్పున బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. వారి వెంట కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ వేల్పూరి సత్యనారాయణరావు, బీఆర్ఎస్ మండల కో ఆర్డినేటర్ పాలెపు శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి రామారావు, నాయకులు సోమ వెంకటస్వామి, అక్కల పోశాలు, బండి రమేశ్, సామ కృష్ణారెడ్డి, అప్పని రాంబాబు, దొమ్మటి సదయ్య, అక్కల మాదవులు, డాక్టర్ సర్వేశ్, కోరె రాజు, చిమ్మ దేవేందర్‌రావు, కుమార స్వామి, చిమ్మ రవి, మల్లయ్య, రాజమల్లు, కుమార్, కృష్ణ, రాజు తదితరులున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఏటూరునాగారం, ఏప్రిల్ 29 : బాల్య వివాహాలు బాలికల ఎదుగుదలకు అవరోధాలని సీడీపీవో హేమలత అన్నారు. ఐసీడీఎస్ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ కార్యకర్తలతో సోమవారం బాల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో హేమలత మాట్లాడారు. బాల్య వివాహాలతో శారీరక, మానసిక ఎదుగుదల నిలిచిపోతుందన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా అమ్మాయిలకు వివాహం చేయొద్దన్నారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం పరిరక్షణ అధికారి హరికృష్ణ, బాలల సదనం సూపరింటెండెంట్ సుమతి, సూపర్‌వైజర్లు వసంత, ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

తాడ్వాయి, ఏప్రిల్ 29 : సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంతో పాటు మండలంలోని కామారం, మేడారం గ్రామాల్లో ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి ప్రజలకు సైబర్ నేరాల మోసాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో అపరిచిత లింకులను క్లిక్ చేయవద్దని తెలిపారు. మోసపోయామని తెలిసిన వెంటనే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించి పూర్తి వివరాలను అందించాలని సూచించారు.

వాహనాల తనిఖీ

వాజేడు, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గుమ్మడిదొడ్డిగ్రామశివారు ఇప్పగూడెం క్రాస్ రోడ్డు జాతీయ రహదారిపై సోమవారం ఎస్సై చావళ్ల వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ పోలీసులు వాహన తనిఖీలు చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు మండలంలోని వివిధ ప్రాంతాలకు వచ్చిపోయే వాహనాలను ఆపి సోదాలు చేశారు. అనుమానితులను ప్రశ్నించడంతో పాటు సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

చెక్ పోస్టుల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న రామ్‌కుమార్‌గోపాల్

ములుగురూరల్, ఏప్రిల్ 29 : ములుగు మండలంలోని మల్లంపల్లి, వెంకటాపూర్ మండలం వెల్టుర్లపల్లి క్రాస్ రోడ్డులోని స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ (ఎస్ఎస్‌టీ) చెక్ పోస్టులను ఎన్నికల వ్యయ పరిశీలకుడు రామ్‌కుమార్‌గోపాల్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్ పోస్టు సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. తనిఖీ సమయంలో వీడియో రికార్డింగ్ తప్పని సరిగా చేయాలన్నారు. ఆయన వెంట ములుగు తహసీల్దార్ విజయ్ భాస్కర్, ఎస్సై వెంకటేశ్వర్, ఇతర అధికారులున్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 29 : స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరుగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మంగీలాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించగా మంగీలాల్ మాట్లాడారు. మైక్రో అబ్జర్వర్లు తమ విధులను పకడ్బందీగా నిర్వర్తిస్తూ పోలింగ్ టీంలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకూ ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. అలాగే మాక్‌పోలింగ్, పీవో డైరీ చెక్ చేయాల్సి ఉంటుందని, వెబ్‌కాస్టింగ్, వీడియో గ్రఫీ, గ్రీన్ పేపర్ సీల్స్, మొదలైన వాటిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో సామ్యూల్, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాశ్ పాల్గొన్నారు.

సిబ్బందికి రెండో విడత శిక్షణ

భూపాలపల్లి కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 28 : లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ విధులు కేటాయించిన పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు మే 1, 2, 3 తేదీల్లో రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేశ్ మిశ్రా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత ర్యాండమైజేషన్ అనంతరం పీవోలు, ఏపీవోలకు విధులు కేటాయించినట్లు తెలిపారు. భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో నిర్వహించే శిక్షణ తరగతులకు పీవోలు 397 మంది, ఏపీవోలు 425, ఓపీవోలు 789 మంది ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని ఆదేశించారు. గైర్హాజరైన సిబ్బందిపై ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు

మాట్లాడుతున్న భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 29 : ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దని జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివస్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 11 మంది నుంచి ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సివిల్ వివాదాల ను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం చేయడానికే ప్రజాదివస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన ఒకరిపై కేసు

ఏటూరునాగారం, ఏప్రిల్ 29 : యువకుడిపై దాడికి పాల్పడిన ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ ఉప్పలయ్య ట్రాక్టర్ కిరాయి ఇవ్వడం లేదని అతని కుమారుడిని మండలానికి చ